## లంచగొండుల వివరాలు ఏసిబికి తెలపండి

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు, లంచగొండితనానికి పాల్పడుతున్నట్లు ఎలాంటి సమాచారమున్నా అవినీతి నిరోధక శాఖకు తెలయజేయ వలసిందిగా ఏసిబి డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు. సమాచారం అలందించిన వారుపేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపారు.

వివరాలకు:

డైరెక్టర్ జనరల్, అవినీతి నిరోధక శాఖ,
మొజంజాహి మార్కెట్ రోడ్, హైద్రాబాద్ -500 001
ఫోన్: (040) 2475132,



# దేశ టైమ్స్

DESHA TIMES
TELUGU DAILY
తెలుగు దినపత్రిక


## వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణ ముఖ్యం

హైదరాబాద్, వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణ సమాజానికి అత్యంత ముఖ్యమని నిమ్స్ డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ నగరి బీరప్ప అన్నారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో హెల్త్‌మిషన్-100లో భాగంగా వయోవృద్ధులకు ఉచిత సమగ్ర ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని నగరి బీరప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ తరహా ఉచిత సమగ్ర ఆరోగ్య శిబిరాలు వృద్ధుల్లో వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి, సరైన చికిత్స అందించడానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా నిమ్స్ ఆస్పత్రి ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. నిమ్స్ జెరియాట్రిక్ మెడిసిన్ ప్రొఫెసర్ వై.సత్యనారాయణ రాజు మాట్లాడుతూ.. వయోవృద్ధులలో సాధారణంగా కనిపించే వ్యాధులను ముందుగానే గుర్తించడం చాలా ముఖ్యమన్నారు.


నల్లగొండ సంపుటి:16 సంచిక:77 ఎడిటర్: సయ్యద్ పాష 02-04-2026 గురువారము పేజీలు :8 వెల:1/-


# పెండింగ్ బిల్స్ వెంటనే విడుదల చేయాలి




హైదరాబాద్ :సమాచారశాఖ కార్యాలయం చిన్న దినపత్రికల సంపాదకులు సమావేశం కావడం జరిగింది. ముఖ్యంగా పెండింగ్ బిల్స్, గత మూడు నెలలుగా ఆగిపోయిన ప్రకటనలను ఈ నెల నుండి విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం జరిగింది. సమాచార శాఖ నుండి వెళ్లి ఫైనాన్స్ డిపార్ట్మెంట్ లో ఆగిపోయిన బిల్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. పెండింగులో ఉన్న ఇతర సమస్యలు వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరడం




జరిగింది. ఫైనాన్స్ లో పెండింగులో ఉన్న బిల్స్ వెంటనే చెల్లించకపోతే, ఆగిపోయిన ప్రకటనలను ఈనెల నుండి తిరిగి విడుదల చేయకపోతే ఆందోళన చేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. అన్ని సమస్యల పరిష్కారం కోసం 10 మందితో ఒక కమిటీని ఏర్పాటు చేసి కార్యాచరణ చేపట్టాలని, ఇందిరా పార్కు వద్ద ధర్నా చేపట్టాలని, వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నాయకులు, జర్నలిస్ట్ నాయకులను ఆహ్వానించాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది.

# బీజేపీ 'హ్యాట్రిక్' విజయాన్ని సాధిస్తుంది: ప్రధాని మోదీ



అసోం, అసోంలో బీజేపీ 'హ్యాట్రిక్' విజయాన్ని సాధిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. రానున్న అసోం అసెంబ్లీ ఎన్నికలు కాంగ్రెస్ స్వయం ప్రకటిత యువరాజుకు (రాహుల్ గాంధీని ఉద్దేశించి) ఓటముల సెంచరీ పూర్తి చేసే సందర్భం అవుతాయని ఎద్దేవా చేశారు. అసోంలో గత పదేళ్ల బీజేపీ పాలనా కాలాన్ని సేవ, సుపరిపాలన యుగంగా అభివర్ణిం చారు. అసోంలోని గోగాముఖ్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోదీ ఈ మేరకు వ్యాఖ్యానించారు.రాష్ట్రంలో యూసీసీని అమలు చేస్తాం : మోదీ అసోంలో యూసీసీని అమలు చేస్తా మని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విభజన రాజకీ యాలను అనుసరిస్తోందని ఆరోపించారు. సమాజంలో విభజనలు సృష్టించగల చట్టాన్ని గతంలో కూడా ఆ పార్టీ ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించిందని మండిపడ్డారు. ఆదివాసీ హక్కులను కాపాడతామని ఓటర్లకు మోదీ హామీ ఇచ్చారు."2014కి ముందు కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం మత హింసపై ఒక బిల్లును తీసుకురావడానికి ప్రయత్నించింది. ఓ నిర్దిష్ట ఓటు బ్యాంకును సంతృప్తి పరచడమే ఈ బిల్లు లక్ష్యం. ఈ బిల్లు హింసకు పాల్పడిన వారిలో మెజారిటీ వర్గాన్ని దోషులుగా, మైనారిటీలను బాధితులుగా చిత్రీకరిస్తుంది. ఇది విభజనవాద బిల్లు. బీజేపీ దీనిని వ్యతిరేకించింది. ఒకవేళ ఈ బిల్లు ఆమోదం పొంది ఉంటే సమాజంలోని మెజారిటీ వర్గం ఎంతటి వేధింపులను ఎదుర్కొని ఉండేదో ఊహించండి. ఇప్పుడు 12 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ అసోంలో అలాంటి బిల్లునే తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. ఎన్నికల్లో గెలవడానికే కాంగ్రెస్ నాయకులు ఈ విషయాన్ని బహిరంగంగా చెబుతున్నారు. గత పదేళ్లలో అసోం అభివృద్ధిలో సుదీర్ఘ ప్రయాణాన్ని సాగించిందని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుత యువతరం బీజేపీ సుపరిపాలనను మాత్రమే చూశారే తప్ప, కాంగ్రెస్ పార్టీ చీకటి పాలనను చూడలేదన్నారు. గత దశాబ్ద కాలంలో అసోం అభివృద్ధిలో ఒక సుదీర్ఘ ప్రయాణాన్ని పూర్తి చేసిందన్నారు. గత పదేళ్ల కాలంలో అసోంకు చెందిన వేలాది మంది యువత తుపాకులను పక్కన పెట్టి భవిష్యత్తుపై దృష్టిసారించారని తెలిపారు. కాంగ్రెస్ తన పాలనలో మౌలిక సదుపాయాల లోపాలను సరిదిద్దడంలో విఫలమైందని ఆరోపించారు."మొదట శర్బానంద సోనోవాల్ నాయకత్వంలో, ఆ తర్వాత హిమంత బిశ్వశర్మ మార్గదర్శకత్వంలో గత పదేళ్లుగా అసోం సేవ, సుపరిపాలన అనే కొత్త శకాన్ని చూసింది. త్వరలో రాష్ట్రంలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు అభివృద్ధి చెందిన అసోంను నిర్మించే ఎన్నికలు. మరికొద్ది రోజుల్లో జరగబోయే అసోం శాసనసభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలో ఎన్‌డీఏకు హ్యాట్రిక్ విజయం ఖాయం. అలాగే కాంగ్రెస్‌కు ఓటముల హ్యాట్రిక్ కూడా ఖాయం. అంతేకాకుండా కాంగ్రెస్ స్వయం ప్రకటిత యువరాజుకు ఓటముల సెంచరీ కూడా ఖాయంగా కన్పిస్తోంది. అసోం అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తర్వాత ఇదే నా మొదటి బహిరంగ సభ. ఇక్కడ కనిపిస్తున్న ఈ జనసముద్రమే మూడోసారి ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం ఖాయమని చెప్పడానికి నిదర్శనం. ప్రజల ఆశీస్సులతో నేను వరుసగా మూడుసార్లు ప్రధానమంత్రి పదవిని అధిరోహించాను.

# అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే బాలు నాయక్



దేవరకొండ, : దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల అలాగే ఉర్దూ మీడియం శిథిలమైన పాఠశాల/కళాశాలను అవసరమైన అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అధికారులకు సూచించారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ జూవేరియా తబస్సుమ్ సమీర్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆలంపల్లి నర్సింహా, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కామల వెంకటయ్య గౌడ్, సీనియర్ నాయకులు నజీర్, మాజీ సర్పంచులు దొండేటి మల్లారెడ్డి, పాప నాయక్, రాజు నాయక్,సురేందర్ రెడ్డి, గిరి, ఏఈలు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

నల్లగొండ : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఆర్టీసీ నల్లగొండ డిపో జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు, టీజీఎస్ఆర్టీసీ-జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నల్లగొండ డిపో జేఏసీ ఆధ్వర్యంలో కార్మికులు బ్లాక్ డే లో భాగంగా నల్ల బ్యాడ్జీలు, బ్లాక్ డే బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎన్ఆర్‌సీ రాజు, డిపో జేఏసీ నాయకులు వీఎస్ రెడ్డి, ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజియన్ అధ్యక్షుడు కందుల నర్సింహ, రీజియన్ సహాయ కార్యదర్శి కె.శ్యామ్ సుందర్, డిపో అధ్యక్షుడు నర్సింహయ్య, కార్మికులు బీఆర్ లింగం, కె.జయరాజ్, కెఎల్ రెడ్డి, కె.కుమార్, టీఎస్ రెడ్డి, కేఎస్ రెడ్డి పాల్గొన్నారు.

# జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

పెద్దవూర, జాతీయ నాయకుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని జాతీయ నాయకుల విగ్రహాలనిర్మాణ వ్యవస్థాపక అధ్యక్షులు పులిమాల కృష్ణారావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జాతీయ నాయకుల విగ్రహాల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఏప్రిల్ 5న బాబు జగ్జీవన్ రావు జయంతి, ఏప్రిల్ 11న మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి, ఏప్రిల్ 14న డాక్టర్ అంబేద్కర్ జయంతిని అన్నీ వర్గాల నాయకులు నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఉన్నటువంటి అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, ఉపసర్పంచులు, అంబేద్కర్ వాదులు, అభిమానులు పార్టీలకతీతంగా పాల్గొని ఈఉత్సవాలను విజయవంతం చేయాలని తెలిపారు.

# నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయి: ఖర్గే



న్యూఢిల్లీ:దేశంలో ఈరోజు నుంచి చాలా నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయని, ఇది బీజేపీ లూట్ దివస్ అని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. భారత్ వ్యూహాత్మక, ఆర్థిక విధానాలను మోదీ సర్కారు సర్వ నాశనం చేయబట్టే ఈ దుస్థితి దాపురించిందన్నారు. ఈ సంక్షోభ కాలంలో దేశంలోని సామాన్యులు ఊరట కోసం ఎదురు చూస్తుంటే, బీజేపీ సర్కారు మాత్రం ప్రజలను లూటీ చేయడంపై, దేశాన్ని దోపిడీ చేయడంపై పూర్తి ఫోకస్ పెట్టిందని ఆయన మండిపడ్డారు. ఈమేరకు బుధవారం రోజు ఖర్గే ఒక ట్వీట్ చేశారు.పెరిగిన టీ, తినుబండారాల రేట్లు "దేశ వ్యూహాత్మక, ఆర్థిక విధానాలను మోదీ సర్కారు నాశనం చేసిన పర్యవసానాన్ని ఇప్పుడు 140 కోట్ల మంది భారతీయులు భరిస్తున్నారు. ఈరోజు నుంచి పలు నిత్యావసరాలు, 900కుపైగా ఔషధాల ధరలు పెరగబోతున్నాయి. దీని వల్ల ప్రజల ఆరోగ్య సంరక్షణ వ్యయాలు చుక్కలను అంటుతున్నాయి. గుండె జబ్బులు ఉన్న రోగులకు అమర్చే కరోనరీ స్టంట్ల ధరలూ పెరిగాయి. వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ల ధరలు రాకెట్ వేగంతో పెరుగుతు న్నాయి. ఈ సిలిండర్ల సప్లై దారుణంగా తగ్గిపో యింది. దీంతో టీ రేటు, రోడ్డుపక్కన అమ్మే తినుబండారాల రేట్లు కూడా పెరిగి పోయాయి. ప్రత్యేకించి ప్రభుత్వ స్కూళ్లలో అమలుచేసే మధ్యాహ్న భోజన పథకంపైనా ప్రతికూల ప్రభావం పడు తోంది. విమాన ఇంధనం ధర మరింత ప్రియం అవుతోంది. ఒకప్పుడు సామాన్య పౌరులూ విమానాల్లో ప్రయాణించేవారు. ఇప్పుడు విమాన ప్రయాణం అనేది ఖరీదైన విషయంగా మారిపోయింది. సాక్షాత్తూ ప్రభుత్వమే విమాన టికెట్ల ధరలపై పరిమితిని ఎత్తేసింది. బిట్యుమెన్ ధరలూ 50 శాతం పెరిగాయి. ప్రజలు ఇప్పుడు మరింత ఎక్కువ టోల్ ట్యాక్స్‌ను చెల్లించాల్సి వస్తోంది. ఇది హైవేలపై దారుణమైన దోపిడీలా మారిపోయింది. స్పీడ్ పోస్ట్ ఛార్జీ సైతం 34 శాతం పెరిగింది. ప్లాస్టిక్ వస్తువులు, స్టీల్, సిరామిక్స్, రైతులు వినియోగించే పీవీసీ పైపుల ధరలూ పెరిగాయి. దేశ నిర్మాణ రంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది" అని ట్వీట్‌లో ఖర్గే ప్రస్తావించారు.

# ట్రంప్, మోదీ స్నేహంతో భారత్ – అమెరికా బంధం బలోపేతం



న్యూఢిల్లీ:భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిజమైన స్నేహితుడిగా భావిస్తారని దిల్లీలోని అమెరికా రాయబారి సెర్జియో గోర్ తెలిపారు. వారి స్వచ్ఛమైన స్నేహం ఇరుదేశాల సంబంధాలను బలోపేతం చేస్తోందని పేర్కొన్నారు. భారత్ – అమెరికా బంధాన్ని 21వ శతాబ్దపు వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చాలి అనేది తన లక్ష్యమని ఆయన వెల్లడించారు. ఇరుదేశాలకూ ఉమ్మడి ప్రయోజనాన్ని కలిగించే లక్ష్యాలతో పనిచేసే గొప్ప అవకాశం తనకు లభించిందన్నారు. న్యూఢిల్లీలో బుధవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో సెర్జియో గోర్ ఈ వ్యాఖ్యలు చేశారు.'నా కుటుంబంతో కలిసి తొలిసారిగా 15 ఏళ్ల క్రితం భారత్‌లో పర్యటించాను. ఆ పర్యటన అనుభవాలను నేను అస్సలు మర్చిపో లేకపోయాను. అవి నా మనసులో పదిలంగా నిలిచిపోయాయి. భారతదేశ సంస్కృతి, చరిత్ర, రంగులు, గొప్ప నేపథ్యం గురించి అప్పట్లోనే నేను తెలుసుకున్నాను. భారత ప్రజల ఆప్యాయత, దయాభావంతో నేను చాలా ప్రభావితుడిని అయ్యాను. ఈ నేపథ్యంలో చాలా ఏళ్ల తర్వాత భిన్నమైన పరిస్థితుల్లో అమెరికా రాయబారి హోదాలో నేను మళ్లీ భారత్‌కు వచ్చాను. ఇప్పటికీ నాతో భారత ప్రజల స్నేహభావం ఏమాత్రం తగ్గలేదని బలంగా చెప్పగలను. వీటి ప్రాతిపదికన ఇరుదేశాల సంబంధాలను బలోపేతం చేయడమే నా లక్ష్యం' అని భారత్‌లోని అమెరికా రాయబారి సెర్జియో గోర్ చెప్పారు.'ఇటీవలే (మార్చి 31న) నేను అమెరికాకు వెళ్లినప్పుడు వైట్ హౌస్‌లో ప్రెసిడెంట్ ట్రంప్‌తో భేటీ అయ్యాను. భారత్ –అమెరికా బంధం బలోపేతం కావ డం అనేది చాలా ముఖ్యమని ట్రంప్ నాతో చెప్పారు. ఈ అంశానికి చాలా ప్రాధాన్యత ఉంటుందని ప్రెసిడెంట్ తెలిపారు. ప్రెసిడెంట్ ట్రంప్ నిత్యం రాజకీయాల్లో బిజీగా ఉంటారు. ఆయన చాలా వేగంగా పావులు కదుపుతుంటారు. ఫలితాలను ఆశిస్తుంటారు. నా నుంచి ట్రంప్ ఆశించే ఫలితం ఏమిటంటే, నేను ప్రతిరోజు ఉదయం భారత్‌లోని ఎంబసీకి వెళ్లాలి. అమెరికా ప్రజలకు ప్రయోజనం కలిగించే, సానుకూల వాతావరణాన్ని సృష్టించే కార్యకలాపాలను నిర్వహించాలి. నేను మాట్లాడే ప్రతీ ఫోన్ కాల్, హాజరయ్యే ప్రతీ సమావేశం, కుదుర్చుకునే ప్రతీ ఒప్పందం, సాధించే ప్రతీ విజయం అమెరికా కోసమే. ప్రెసిడెంట్ ట్రంప్ మా నుంచి ఆశించే పని ఇదే. భారత్ – అమెరికా ద్వైపాక్షిక బంధాన్ని కొత్త ఎత్తులకు తీసుకెళ్లడంతో పాటు అమెరికాకు ప్రయోజనాన్ని కలిగించే ఫలితాలను సాధించడం అనే లక్ష్యం మాకు ఉంటుంది. రక్షణ, ఇంధన, విమానయాన, అధునాతన తయారీ, డిజిటల్ మౌలిక సదుపాయాల విభాగాల్లో భారత్ – అమెరికా బంధం బలోపేతం అవుతోంది. దీనివల్ల ఇరుదేశాల్లో కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయి. సప్లై చైన్ వ్యవస్థలు బలోపేతం అవుతున్నాయి' అని సెర్జియో గోర్ పేర్కొన్నారు.

# రెండు రాష్ట్రాలు అభివృద్ధి కావాల్సి ఉంది: కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ:లోక్‌సభలో అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చ సమయంలో తెలుగు రాష్ట్రాల అభివృద్ధి, తెలంగాణకు విభజన హామీల అమలులో జరుగుతున్న అన్యాయాన్ని ఎంపీలు ప్రస్తావించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, సుదీర్ఘ పోరాటం తర్వాత తెలంగాణ విడిపోయిందని గుర్తు చేశారు. తెలంగాణ పోరాటంలో 1969లో కాంగ్రెస్ పార్టీ 369 మందిని తుపాకులతో కాల్చి చంపిందని ఆరోపించారు. జై తెలంగాణ అన్నందుకు విద్యార్థులను కాల్చి చంపారని, చివరి దశలో కూడా 1200 మంది ఆత్మ బలిదానంతో తెలంగాణ వచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచి తెలంగాణ సాధించుకున్నారని కొనియాడారు.రాజధాని లేదని చెప్పుకోవడం దురదృష్టకరం : విభజన తర్వాత పోటీతత్వంతో రెండు రాష్ట్రాలు అభివృద్ధి కావాల్సి ఉందని కిషన్ రెడ్డి తెలిపారు. ఇప్పటికీ అమరావతిని రాజధానిగా చెప్పుకునే పరిస్థితి లేకుండా ఉందని, ఏపీ ప్రజలు తమకు రాజధాని లేదని చెప్పుకోవడం దురదృష్టకరమని అన్నారు. కాంగ్రెస్ సభ్యులు తమకు ఎయిర్‌పోర్టు లేదని చెబుతున్నారని, అది ఎవరి పాపమని అడిగారు. ఏపీలో 8 విమానాశ్రయాలు, తెలంగాణలో ఒకే ఒకటి ఉందని గుర్తు చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ అధికారంలో ఉండి వరంగల్ ఎయిర్‌పోర్టుకు భూములు ఇవ్వలేదని, గతంలో కాంగ్రెస్ కూడా తెలంగాణలోని ఇతర విమానాశ్రయాల విషయంలో నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు.

# తమిళనాడులో అల్లర్లు సృష్టించేందుకు కుట్ర : సీఎం స్టాలిన్



తమిళనాడు : తమిళనాడు లో అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడటంతో ప్రచారం జోరందుకుంది. రాజకీయ పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు హోరెత్తుతున్నాయి. బుధవారం బీజేపీ లక్ష్యంగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిఎంకే స్టాలి న్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఉత్తరప్రదేశ్ ,మణిపూర్ రాష్ట్రాల్లో మాదిరిగానే తమిళనాడులోనూ అల్లర్లు సృష్టించేందుకు కమలం పార్టీ కుట్ర పన్నిందని ఆయన ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరుచ్చిలో జరిగిన బహిరంగసభలో స్టాలిన్ మాట్లాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కనిపించే ఘర్షణలు, మూక దాడులు తమిళనాడులో ఇప్పటివరకు లేవని అన్నారు. ఈ సందర్భంగా యూపీ, మణిపూర్ పేర్లను ఆయన ప్రస్తావించారు.

# చిన్నారి దారుణ హత్య

మహబూబ్‌నగర్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. నాలుగేళ్ల చిన్నారిని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి, చెరువుగట్టు దగ్గర పడేసి వెళ్లారు. అమ్మిరెడ్డిపల్లిలో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.చెరువుగట్ట దగ్గర పాప మృతదేహం లభిం చడంపై సమాచారం అందుకున్న పోలీసు లు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. తల్లిదండ్రులు ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌కు వలస వెళ్లగా.. పాప తన అవ్వ తాతల దగ్గరే ఉంటుంది.

# దేశ టైమ్స్

## సంపాదకీయం

### జోడుగుర్రాల స్వారీ జేమ్స్ బాండ్ సినిమాలో తప్ప నిత్యజీవితంలో ఆ సర్కస్ ఫీట్ సాధ్యం కాదు!

జోడుగుర్రాల స్వారీ జేమ్స్ బాండ్ సినిమాలో తప్ప నిత్యజీవితంలో ఆ సర్కస్ ఫీట్ సాధ్యం కాదు! ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా విద్యారంగంలో సంస్కరణ కోసం ఒకవైపు ఆకునూరి మురళి కమిషన్ వేసి, మరోవైపు కె.కేశవరావు విద్యాకమిషన్ ప్రకటించి చేసే ప్రయాణం నిజంగా జోడుగుర్రాల స్వారీ లాంటిదే! ఈ రెండు గుర్రాలు కూడా దేనికదే ప్రత్యేకం, కాడి కలుపుకుపోయే రకం కానేకాదు. కమిషన్ నిర్ణయం మాత్రమే ఫైనల్ కాదు, 'ఏవైనా సమస్యలు ఉంటే కేశవరావుకు చెప్పుకోండి' అని ముఖ్యమంత్రినే ప్రకటించడం మాట ప్రజాస్వామికమే అయినా చేతల్లో వైవిధ్యం కనిపిస్తుంది. స్వచ్ఛంద సంస్థల సహకారంతో విద్యా అభివృద్ధి అవుతుందని కేశవరావు నమ్ముతారు. ఆకునూరి మురళి ప్రభుత్వం ఆధ్వర్యంలోని పబ్లిక్‌స్కూల్స్ తప్ప మరోమార్గం లేదనేది ఆయన నమ్మకం. ఇరువురిది పరస్పర విరుద్ధమైన ఆర్థిక ప్రణాళిక. సమన్వయం చేయగలిగితే పర్వాలేదు! వికటిస్తే విద్యావ్యవస్థనే అస్తవ్యస్తమవుతుంది. వ్యక్తిగత సర్దుబాట్ల కంటే వ్యవస్థాగత సర్దుబాటు ముఖ్యం. కొత్త విధానం ప్రవేశపెట్టినప్పుడు అపోహలకు, అపార్థాలకు అవకాశం లేకుండా ఎదురయ్యే సవాళ్లు పరిష్కారం చేయాల్సి ఉంటుంది. మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అధ్యక్షతన వేసిన విద్యాకమిషన్ తెలంగాణా ప్రభుత్వ పాఠశాల వ్యవస్థపై సుదీర్ఘ అధ్య యనం చేసి ఓ నివేదిక అందజేసింది. ఆ నివేదిక ఆధారంగా ఈ ఏడాది బడ్జెట్‌లో ఆరు వేల కోట్ల రూపాయలు కేటాయింపులు ఉండాలి, కానీలేవు, అయినా ప్రభుత్వ బడిని సంస్కరిస్తామని ప్రభుత్వం అంటున్నది. నర్సరీ నుండి ఇంటర్ వరకు ఆంగ్ల మాధ్యమంలో పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందించాలనేది ప్రభుత్వ లక్ష్యం. అందుకోసం ఈ ఏడాది ఓ వంద నియోజకవర్గాలు, రెండు వందల మండలాల్లో మండ లానికి రెండు ప్రభుత్వ పాఠశాలల చొప్పున నాలుగు వందల పాఠశాలలు పునర్వ్యవస్థీకరణ జరుగుతోంది. ఒక్కోపాఠశాలకు పదిహేను కోట్ల రూపాయల బడ్జెట్‌తో 1500 మంది పిల్లల నమోదుతో "తెలంగాణా పబ్లిక్ స్కూల్స్" ఏర్పడతాయి. ఎవరేమి చెప్పినా ప్రభుత్వ బడులలో నమోదు శాతం పడిపోతు, మూతపడుతున్న దశలో తాజా సంస్కరణ అనివార్యం! ఈ ఏడాది పార్లమెంటులో ప్రవేశపెట్టిన నివేదికలో రాష్ట్రంలో 1920 ప్రభుత్వ బడుల మూతతో దేశంలో రెండవ స్థానంలో నిలబడ్డాం. ఇక విద్యాప్రమాణాలు దృష్ట్యా చూసినప్పుడు దేశంలో మనర్యాంకు 26వ స్థానంలో ఉంది. ఈ రెండు గణాంకాల సూచిక ప్రభుత్వ బడులు సంస్కరణ అనివార్యతకు సూచిక. కనుక విద్యాకమిషన్ సూచనలు నూటికి నూరుశాతం ఆమోదయోగ్యం. ఇక సమస్యలు గుర్తించడానికి, నిర్వాహణకు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక విద్యాబోర్డులను ఏర్పరచడం. సంస్కరణ పారదర్శకంగా అమలు జరగాలంటే, ఈ విద్యాబోర్డులలో విద్యారంగంలో నిపుణులు, మాజీ విద్యాశాఖ అధికారులను సైతం జిల్లా రాష్ట్ర స్థాయిలో భాగస్వాములను చేయాలసి ఉంటుంది. ఒక్కో మండలంలో 30 ప్రాథమిక పాఠశాలలు, ఓ ఏడెనిమిది ఉన్నత పాఠశాలలు, ఐదారు ప్రాథమికోన్నత పాఠశాలలు స్థానంలో రెండే పాఠశాలల ఎంపిక, స్థాపన, నిర్వాహణ ఒక రకంగా చిక్కు సమస్యనే? పాఠశాల యాక్సెస్ అనబడే సరికొత్త సమస్య ఎదురయ్యే అవకాశం ఉంది. వాస్తవానికి విద్యాకమిషన్ తొలుత సిఫార్సు చేసిన విధంగా మండలానికి మూడు తెలంగాణా పబ్లిక్ స్కూల్స్, నాలుగు తెలంగాణా ఫౌండేషన్ స్కూల్స్ ఏర్పరచి ఉంటే కొంతలో కొంతైనా మండలంలో యాక్సెస్ సర్దుబాటు కాస్తా సమస్య తేలికయ్యేది. ఇప్పుడు రెండే రెండు తెలంగాణా పబ్లిక్ స్కూల్స్ స్థాపన మూలంగా ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం అనేది తప్పనిసరి అవుతుంది. ఈ ఏడాది బడ్జెట్‌లో దానికి అవకాశం కల్పించలేదు. ఐదేండ్ల కాలపరిమితిలో రాష్ట్రంలో ఉన్న 26వేల వివిధ రకాల పాఠశాలల స్థానంలో సమగ్ర సౌకర్యాలతో కేవలం రెండువేల తెలంగాణా పబ్లిక్ స్కూల్స్ మాత్రమే ఉనికిలో ఉంటాయి. తెలంగాణా పబ్లిక్ స్కూల్స్ అనే అంశంలో భౌతికపరమైన అంశం ఎలావున్నా కొన్ని చట్టబద్ధమైన, నిర్వాహణాపరమైన సంక్లిష్టతలు తొలగించుకోవాలసి ఉంటుంది. అందులో మొదటిది మాతృభాషలో విద్యాబోధన. మనఫెడరల్ వ్యవస్థలో కేంద్ర విద్యాచట్టానికి లోబడి రాష్ట్ర చట్టం ఉండాలి. విద్యాహక్కుచట్టం 1 నుండి 5 తరగతులు మాతృభాషలో విద్యాబోధన తప్పనిసరి చేసినందువల్ల, విద్యా కమిషన్ ఈవిషయంలో సడలింపు ఇవ్వాలి. నర్సరీ నుండి 5వతరగతి వరకు ఆంగ్ల మాధ్యమంతోపాటు, మాతృభాష మాధ్యమం సైతం ఆప్షన్‌గానైనా అనుమతించే సవరణ తప్పనిసరి. ఎందుకంటే పిల్లలకు తమది కాని ఏ భాషనైనా ఆధిపత్య భాషనే అవుతుంది. మారుతున్న ప్రాపంచిక పరిస్థితులలో ఆంగ్లం ప్రాధాన్యతనే సుదీర్ఘకాలం ఉంటుందని భావించలేము. ఇక రెండవ అంశం, తెలంగాణా పబ్లిక్ స్కూల్స్‌నందు ఉత్తీర్ణత 35మార్కుల నుండి 45మార్కులకు పెంచడం. ఓ శతాబ్దకాలంగా మన విద్యా మేధావులు ఈ ఉత్తీర్ణత ప్రమాణమే అశాస్త్రీయ అంశమని తేల్చారు. అందుకే విద్యాహక్కు చట్టం-2009లో నిరంతర సమగ్ర మూల్యాంకనం (సిబిఐ)ని తెచ్చారు. దీని ప్రకారం విద్యార్థుల విద్యా సామర్థ్యాల కొలమానం గ్రేడులేకాని మార్కుల ప్రాతిపదిక కాదు. మరి ఈ కొలమానం పదవతరగతి, 12వ తరగతి పబ్లిక్ పరీక్షలలో ఎలా అమలు చేసేది చిక్కు సమస్యనే! విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రమాణాలు కొలమానమే కాని మార్కుల ప్రాతిపదిక ఉండదు. ఒకవేళ మనం అమలు చేసినా 35మార్కుల నుండి ఉత్తీర్ణత శాతం 45శాతంగా నిర్ణయం చేయడం సమంజసం కాదు. కనీసం మధ్యేమార్గంగా నలభై మార్కులకు కుదించడం లేదా అన్ని సబ్జెక్టులు సరాసరి నలభై చూసి ఉత్తీర్ణత ప్రమాణం నిర్ణయించడం కూడా చేయవచ్చును. ఇంజ నీరింగ్, ఫార్మసీ, వ్యవసాయ విద్యకు ప్రవేశపరీక్ష లేనందున ఇంటర్ పరీక్షలకే అత్యధిక ప్రాధాన్యత ఉంటుంది. ఒకవేళ ఇంటర్, పది పరీక్షలు మార్కుల ప్రాతిపదికన నిర్వహించినా సిసిఐ విధానంలోనే నిర్వహించాల్సి ఉంటుంది. ఇక తెలంగాణాలో ఉన్న ప్రయివేటు విద్యా వ్యవస్థ కూడా "తెలంగాణా పబ్లిక్ స్కూల్స్"విధానాలనే నూటికి నూరుశాతం అనుసరించేలా చూడాలి. ఇక మూడవ ప్రధాన అంశం, ఉపాధ్యాయ విద్యలో సంస్కరణ. ఉపాధ్యాయ విద్యలో నర్సరీ, ప్రాథమిక విద్య, ఉన్నత పాఠశాల విద్య మొత్తానికి రెండేరకాల శిక్షణ కోర్సులు సూచించింది. ప్రాథమిక ఉపాధ్యాయ శిక్షణ, సెకండరీ ఉపాధ్యాయ శిక్షణ, రెంటికీ పీజీని కనీసం అర్హతగా కమిషన్ సూచించింది. కనుక టెట్, ఆటోమేటిక్ అడ్వాన్స్ ప్రమోషన్, అదనపు అర్హతలకు అదనపు ఇంక్రిమెంట్లు లాంటి ఆర్థిక సమస్యలు ఇక కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులకు ఉండే అవకాశం లేదు. ఇక నర్సరీ నుండి ఇంటర్ వరకు పాలు, రాగి జావ బ్రేక్‌ఫాస్ట్‌గా సూచించడం, ఇంటర్మీడియట్‌కు కూడా మధ్యాహ్న భోజనం విస్తరణ అనే అంశాలు తెలంగాణా పబ్లిక్ స్కూల్స్ అనబడే కాన్సెప్ట్ నుండి వచ్చిన సౌకర్యాలు. ఏ రకంగా చూసినా చిన్నచిన్న మార్పులతో ప్రభుత్వ బడులు సంస్కరణకు ఇంతకంటే మార్గం లేదు. నూతన సిపార్సు ప్రకారం 3-18 వయస్సు పిల్లలకు విద్యాహక్కు చట్టం వర్తింపజేయాల్సి ఉన్నందున నర్సరీ నుండి 12వ తరగతి వరకు పాఠశాల వ్యవస్థ, డిగ్రీ కళాశాలలు, టెక్నికల్ విద్యను యూనివర్సిటీలకు అనుసంధానం చేసి రెండే రెండు విద్యావ్యవస్థలుగా పునర్వ్య వస్థీకరణ చేయడం ప్రభుత్వం ముందున్న ఉత్తమమైన మార్గం. కనుక గత నలభై ఏళుగా మార్పులు జీర్ణించుకోలేక కుదేలైన ప్రభుత్వ పాఠశాల, ఉన్నత విద్యావ్యవస్థకు తిరిగి ప్రాణప్రతిష్ట చేసిన ఖ్యాతి సంస్కరణ ద్వారా సర్కార్‌కు దక్కుతుంది.

## ప్రజలు భయంతో కాకుండా స్పష్టతతో ముందుకు సాగాలి!

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితులు ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపిస్తుది. నేపథ్యంలో, ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు దేశంలో కొత్త చర్చకు తెరతీశాయి. ఒకవైపు ప్రధాని మోదీ 'సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి ప్రజలు సిద్ధంగా ఉండాలని' పిలుపునిస్తే, మరోవైపు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి 'ఎలాంటి సంక్షోభం లేదు, నిల్వలు సమఅద్ధిగా ఉన్నాయి' అంటూ ప్రకటించడం ప్రజల్లో తీవ్ర గందరగోళాన్ని సఅష్టిస్తోంది. రాజ్యసభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, పశ్చిమాసియా యుద్ధం వల్ల ఇంధన సంక్షోభం, ఇతర సవాళ్లు తలెత్తే అవకాశం ఉందని, కరోనా కాలంలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను దఅష్టిలో ఉంచుకుని, ఇప్పుడు ముందుగానే సమైక్యంగా, అప్రమత్తంగా సిద్ధపడాలని సూచించారు. కరోనా నాటి విపత్కర పరిస్థితులను గుర్తు చేస్తూ, 'సహజ్ఞత'తో ముందుకు సాగాలన్న ఆయన పిలుపు సహజంగానే ప్రజల్లో ఆందోళనను రేపింది. ప్రత్యక్షంగా 'లాక్‌డౌన్' అని పేర్కొనకపోయినా, కరోనా నాటి అనుభవాన్ని ప్రస్తావించడం ద్వారా ఆయన ఆ స్థాయి సంక్షోభం వైపు ఈ ప్రభుత్వం చూస్తోందనే భావనకు దారితీసింది. అయితే, కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి మాత్రం ఇదే అంశంపై స్పష్టత ఇస్తూ, దేశంలో లాక్‌డౌన్ ప్రచారం పూర్తిగా అసత్యమని, ప్రభుత్వం వద్ద అలాంటి ప్రతిపాదనలేమీ లేవని చెప్పారు. ఇంధన నిల్వలు సమృద్ధిగా ఉన్నాయన్నారు. ప్రజలు శాంతియుతంగా ఉండాలని కోరారు. ఈ రెండు వ్యాఖ్యల మధ్య ఉన్న స్పష్టమైన విరోధాభాసం ప్రజలను, విశ్లేషకులను ఇబ్బందికర పరిస్థితిలో పడేసింది. ప్రభుత్వ వాదనలకు భిన్నంగా, భూస్థాయి వాస్తవాలు మాత్రం వేరుగా ఉన్నాయి. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో ఎల్పీజీ సిలిండర్ల కొరత, పెట్రోల్, డీజిల్ ధరల హెచ్చుతగ్గులు సామాన్య ప్రజల జీవితాన్ని దెబ్బతీస్తున్నాయి. బుక్‌చేసినా పదిహేను రోజుల తర్వాత కూడా గ్యాస్ సిలిండర్ అందని పరిస్థితి. తెలంగాణలో కూడా బుక్‌చేసి నెలరోజులైనా ఇంకా సిలిండర్లు ఇంటిగడప తొక్కడం లేదు. గ్యాస్ ఏజెన్సీలకు ఫోన్ చేస్తే 'సరఫరా సరిగా కావడం లేదు. కాస్త సమయం పడుతుంది' అన్న మాటలు వినిపిస్తున్నాయి. ఇదే అదనుగా బ్లాక్‌దందా పెట్రేగిపోయింది. మొన్న హైదారాబాద్‌లో టాస్క్‌ఫోర్స్ పట్టుకున్న గ్యాస్ సిలిండర్ల విలువ అక్షరాల రూ. 22లక్షలు. దీనంతటికి కారణం యుద్ధవాతావరణ ప్రభావం ఒక్కటే కాదు, మన పాలకులు సరైన విధంగా ప్రజలకు భరోసా కల్పించకపోవడం. పెట్రోల్ బంకుల వద్ద క్యూలు కూడా ఇంధన సంక్షోభం ఇప్పటికే తలుపు తట్టిందనడానికి నిదర్శనాలు. ఇలాంటి సమయంలో 'సంక్షోభం లేదు' అనే ప్రకటన వాస్తవికతకు దూరంగా ఉంది. ప్రస్తుతం దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ చేసిన 'సంక్షోభ హెచ్చరిక' వెనుక రాజకీయ ఉద్దేశ్యం ఉందా అనే ప్రశ్న కూడా తలెత్తుతోంది. ప్రజల దృష్టిని ఇంధన కొరత, ద్రవ్యోల్బణం వంటి సమస్యల నుంచి మళ్లించి, 'సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు సమైక్యంగా నిలవండి' అనే పిలుపు ద్వారా తమ పార్టీకి అనుకూల వాతావరణాన్ని సృష్టించుకునే ప్రయత్నం జరిగిందా అనేది విశ్లేషకుల సందేహం. ఓటర్లను తమవైపు మలుచుకునే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రధాని మోడీ చెప్పినట్లు సంక్షోభం వస్తోందా? లేదా మంత్రి పూరి చెప్పినట్లు సంక్షోభమే లేదా? ఈ రెండింటి మధ్య ఉన్న సందిగ్ధతే నేడు అసలు సంక్షోభంగా మారింది. కరోనా కాలంలో రోజువారీ కూలీలు, చిన్న తరహా వ్యాపారులు, ప్రయివేటు ఉద్యోగులు ఎదుర్కొన్న ఆర్థిక దుర్భరం ఇప్పటికీ వారి గుండెల్లో భయంగా మిగిలే ఉంది. అలాంటి సమయంలో స్వయంగా ప్రధానమంత్రి 'సంక్షోభానికి సిద్ధపడండి' అనడం, ఎదురుగా మంత్రి 'ఏమీ లేదు' అనడం -- ఈ వైరుధ్యం ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తోంది. ఒకవైపు ప్రభుత్వంలోని ఇద్దరు పెద్ద నేతల మధ్య స్పష్టమైన అభిప్రాయ భేదం కనిపిస్తే, మరోవైపు కిందిస్థాయిలో ఇంధన కొరత వాస్తవంగా మారుతోంది. ఎన్నికల నేపథ్యం ఈ వివాదానికి మరింత రాజకీయ రంగు దిద్దుతోంది. శ్రీరామ నవమి సందర్భంగా దేశం ఉత్సవాల్లో మునిగి ఉన్నా, ప్రజల మన సుల్లో మాత్రం 'మరో కరోనా లాంటి సంక్షోభమా?' అనే ప్రశ్న మెదులు తూనే ఉంది. ఈ గందరగోళాన్ని తొలగించి, వాస్తవ పరిస్థితిపై ప్రభుత్వం స్పష్టమైన, ఏకస్వరంతో మాట్లాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజలు భయంతో కాకుండా, స్పష్టతతో ముందుకు సాగే వాతావరణం కల్పించడం ప్రభుత్వం ప్రధాన బాధ్యత.

## ఖమ్మం జిల్లాలో ఏసీబీ మెరుపు దాడులు..

ఖమ్మం : ఖమ్మం జిల్లా సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఉదయం నుంచే రంగంలోకి దిగిన అధికారులు కార్యాలయ ప్రధాన ద్వారా లను మూసివేసి ముమ్మరంగా సోదాలు నిర్వహించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ పర్యవేక్షణలో జరిగిన ఈ దాడులు పట్టణంలో కలకలం రేపాయి. ప్రధానంగా మున్సిపాలిటీలోని రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాలపై అధికారులు దృష్టి సారించారు. భవన నిర్మాణ అనుమ తులు ఇవ్వడంలో అక్రమాలు, కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులు, పన్నుల వసూళ్లలో నెలకొన్న అవకతవకలపై ఆరా తీశారు. కార్యాలయంలోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు, పలువురు అధికారులు, సిబ్బందిని ఏసీబీ బృందం విడివిడిగా విచారించింది. విధుల్లో నిర్లక్ష్యం.. పెండింగ్లో పన్నులు ఈ సందర్భంగా డీఎస్పీ రమేష్ విలేకరులతో మాట్లాడుతూ.. సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయంపై తమకు అనేక ఫిర్యాదులు అందాయని వెల్లడించారు. సోదాల్లో భాగంగా పలు కీలక అంశాలను గుర్తించినట్లు ఆయన తెలిపారు: పన్నుల వసూళ్లలో జాప్యం: ఇంటి పన్నులు, నీటి పన్నుల వసూళ్లలో భారీగా అలసత్వం వహించినట్లు గుర్తించారు. హాజరులో లోపాలు: కార్యాలయ సిబ్బంది విధులకు హాజరయ్యే విషయంలో నిబంధనలు పాటించడం లేదని తేలింది. ఇళ్లలోనూ సోదాలు ఏసీబీ డీజీ ఆదేశాల మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు డీఎస్పీ తెలిపారు. కేవలం కార్యాలయానికే పరిమితం కాకుండా, మున్సిపాలిటీలోని పలువురు విభాగాధిపతుల నివాసాల్లోనూ ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఈ సోదాల్లో లభించిన వివరాలు, రికార్డులను క్రోడీకరించి సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన స్పష్టం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ దా డుల నేపథ్యంలో సిబ్బందిలో భయాందోళన నెలకొంది.

## అభివృద్ధికి సహకరించాలి..

### మున్సిపల్ చైర్పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి



సూర్యాపేట, : సూర్యాపేట మున్సిపాలిటీ అభివృద్ధికి అందరూ సహకరించాలని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. నూతన పాలక మండలి ఏర్పడిన తరువాత తొలి సమావేశంగా 2025-26 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్ ,2026-27 ముసాయి దా బడ్జెట్ సమావేశాన్ని స్థానిక రవి మహల్ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవేశపెట్టిన రూ. 107.30 కోట్ల బడ్జెట్కు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. తదుపరి చైర్పర్సన్ మొరిశెట్టి నివే దిత లక్షాధి మాట్లాడుతూ మున్సిపాలిటీ ఆదాయ వనరులను విస్తరించడం ద్వారానే పట్టణ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఇంటి పన్నుల ద్వారా రూ. 1775 లక్షలు, స్టాంపు డ్యూటీ ద్వారా రూ. 600 లక్షలు, నాన్-ట్యాక్స్ ఆదాయం (అద్దెలు) ద్వారా రూ. 204.50 లక్షలు, పరి శుభ్రత విభాగం ద్వారా రూ. 111.50 లక్షలు, పట్టణ ప్రణాళిక విభాగం ద్వారా రూ. 1568.50 లక్షలు, ఇంజినీరింగ్ విభాగం ద్వారా రూ. 330.50 లక్షలు ఆదాయం రానుందని వివరించారు. అదనంగా డిపాజిట్లు, రుణాల రూపంలో రూ. 110 కోట్లు, నాన్-ప్లాన్ నిధులు రూ. 620 లక్షలు, ప్లాన్ నిధులు రూ. 5170 లక్షలు, ఇతర నిధులు రూ. 240 లక్షలు కలిపి మొత్తం రూ. 10730 లక్షల బడ్జెట్ రూపొందించామని తెలిపారు. ఖర్చుల కేటాయింపులలో సిబ్బంది వేతనాలకు రూ. 1420 లక్షలు, పారిశుద్ధ్య నిర్వహణకు రూ. 522 లక్షలు, విద్యుత్ చార్జీలకు రూ. 344 లక్షలు, రుణాల చెల్లింపులకు రూ. 406 లక్షలు, గ్రీన్ బడ్జెట్కు రూ. 459 లక్షలు, ఇంజినీరింగ్ విభాగ నిర్వహణకు రూ. 445 లక్షలు, సాధారణ పరిపాలనకు రూ. 219.20 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. అదేవిధంగా పట్టణ ప్రణాళిక విభాగం ఖర్చు కు రూ 7.50 లక్షలు, ప్రజా సౌకర్యాల కోసం రూ. 65.73 లక్షలు, అభివృద్ధి పనులకు రూ. 445.80 లక్షలు, 1/3 బ్యాలెన్స్ బడ్జెట్గా రూ. 255.77 లక్షలు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఇక డిపాజిట్లు, రుణాలు చెల్లింపు లకు 110 లక్షలు కేటాయింపు జరిగిందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రానున్న నాన్-ప్లాన్ గ్రాంట్ కింద రూ. 620 లక్షలు, ప్లాన్ గ్రాంట్ కింద రూ. 2460 లక్షలు, ఇతర నిధుల కింద అభివృద్ధి పనులకు రూ. 2950 లక్షలతో మొత్తంగా 10730 లక్షలు కేటాయించడం జరిగిందని ఆమె వివ రించారు. అనంతరం జరిగిన సాధారణ సమావేశంలో కౌన్సిలర్లు తమ వార్డుల సమస్యలను చైర్పర్సన్, కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుం టామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్పర్సన్ ఎం.డి. షఫీ ఉల్లా, మున్సిపల్ కమిషనర్ సి. హెచ్. హన్మంతరెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కేరళ అభివృద్ధి దేశానికే తలమానికం

ఆలప్పుజ : కేరళ అభివృద్ధి దేశానికే తలమానికమని సీపీఐ(ఎం) నాయకురాలు బృం దాకరత్ అన్నారు. ఆలప్పుజ జిల్లాలోని హరిపాడ్, కాయంకుళంలో, ఎర్నాకులం జిల్లా లోని ఆలూవా, కున్నతునాడు, ఎడపల్లిలో లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) నిర్వహించిన ఎన్నికల సభల్లో పాల్గొని మాట్లాడారు. కేరళలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రముఖంగా ప్రస్తావించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, విపత్తు బాధితుల కుటుంబాల కోసం వాయనాడ్‌లో అభివృద్ధి చేస్తున్న టౌన్‌షిప్ పునరావాసానికి ఒక ఆదర్శంగా నిలుస్తోందని ఆమె పేర్కొన్నారు. కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఇచ్చిన అనేక హామీలను ఆ పార్టీ నెరవేర్చలేదని, ఇతర ప్రాంతాల్లో వాగ్దానాలు నెరవేర్చిన తర్వాతే కేరళలో కూడా హామీలు ఇవ్వాలని ఆమె కాంగ్రెస్‌ను విమర్శించారు. మతతత్వ రాజకీయాలకు, బీజేపీకి వ్యతిరేకంగా సీపీఐ(ఎం), ఎల్‌డీఎఫ్ ధృడమైన వైఖరిని అవలంబిస్తాయని చెప్పారు. ఈ వైఖరిని మరుగుపరిచేందుకు కాంగ్రెస్ "ఒప్పందం" అనే తప్పుడు కథనాన్ని ప్రచారం చేస్తోందని విమర్శించారు. విదేశీ విరాళాల నియంత్రణ సవరణ బిల్లుపై కూడా ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బిల్లు మైనారిటీ మత సమూహాలను లక్ష్యంగా చేసుకుందని, వారిచే నడపబడుతున్న సంస్థల లైసెన్సులను రద్దు చేయడానికి, స్వాధీనం చేసుకోవడానికి వీలు కల్పిస్తోందని అన్నారు. దేశాన్ని బలహీనపరుస్తోన్న కేంద్రం : మరియం ధావలే గత 12 ఏండ్లుగా మోడీ ప్రభుత్వం దేశాన్ని బలహీనపరుస్తోందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు మరియం ధావలే పేర్కొన్నారు. బీజేపీని సమర్థవంతంగా ఎదిరించే శక్తి కేవలం వామపక్షాలకు మాత్రమే ఉందని అన్నారు. మలూరు (మట్టన్నూరు నియోజకవర్గం), చోక్లి (తలస్సేరి నియోజకవర్గం)లో ఎల్డీఎఫ్ నిర్వహించిన ఎన్నికల సభలలో మరియం ధావలే పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెరవూరు నియోజకవర్గం ఎల్‌డీఎఫ్ అభ్యర్థి కేకే శైలజ టీచర్‌తో కలిసి రోడ్ షోను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ భారతదేశంలోనే కేరళలో మహిళలు గొప్ప పురోగతిని సాధించారని, బీజేపీ పాలిత గుజరాత్ లేదా కాంగ్రెస్ పాలిత కర్నాటకలో అటువంటి పురోగతి కనిపించడం లేదని తెలిపారు.

## జిగ్ జాగ్ కెరీర్ పై యువత ఆసక్తి..

న్యూఢిల్లీ:చదివిన చదువుకు, చేసే ఉద్యోగానికి అస్సలు సంబంధం లేకపోవడం ఈ రోజుల్లో కామన్ అయిపోయింది. ఒకే కంపెనీలో ఏళ్ల తరబడి పనిచేసే కాలం పోయింది. ఇప్పుడు ట్రెండ్ అంతా 'జిగ్ జాగ్ కెరీర్‌దే, ఒక రంగం నుంచి మరో రంగానికి మారుతూ, కొత్త స్కిల్స్ నేర్చుకుంటూ దూసుకుపోవడమే ఈ కొత్త ఫార్ములా. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో ఉద్యోగ భద్రత కంటే అప్‌డేట్ అవ్వడమే ముఖ్యం అని గ్రహించిన యువత, ఈ జిగ్ జాగ్ కెరీర్ వైపు మొగ్గు చూపుతున్నారు. అసలు ఈ మ్యాటర్ ఏంటో తెలుసుకుందాం. ఏంటి ఈ జిగ్ జాగ్ కెరీర్?: సాధారణ ంగా మనం ఒకే కెరీర్ పాత్‌లో వెళ్తుంటాం. కానీ జిగ్ జాగ్ కెరీర్ అంటే అ లా కాదు. ఇది ఒక పాము లాంటి ప్రయాణం అన్నమాట! ఒక రంగంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా మొదలుపెట్టి, మధ్యలో మార్కెటింగ్ వైపు వెళ్లి, ఆ తర్వాత క్రియేటివ్ రైటింగ్ లేదా మేనేజ్‌మెంట్ వైపు మారడం. అంటే మనకు నచ్చిన రంగాల్లోకి మారుతూ, విభిన్నమైన పనులను నేర్చుకోవడమే ఈ జిగ్ జాగ్ స్టైల్. మారిన పరిస్థితులకు అనుగుణంగా ఫ్లెక్సిబుల్‌గా ఉండటమే దీని ప్రధాన ఉద్దేశం. యుగంలో తప్పనిసరి మార్పు:ప్రస్తుతం ఉన్న ఏఐ కాలంలో ఏ కంపెనీలోనూ ఉద్యోగం శాశ్వతం కాదు. టెక్నాలజీ మారుతున్న కొద్దీ పాత ఉద్యోగాలు పోయి కొత్తవి వస్తున్నాయి. ఇలాంటి టైంలో "నేను చదివింది ఇదే.. ఈ పనే చేస్తా" అని కూర్చుంటే వెనకబడిపోతాం. అందుకే కంపెనీల అవసరాలకు తగ్గట్టుగా మనం కూడా అప్‌డేట్ అవ్వాలి. ఇక ఒక పని నుంచి మరో పనికి ఈజీగా మారగలిగే సామర్థ్యం ఉంటేనే, ఐటీ లేదా ఇతర రంగాల్లో ఏ సందర్భంలోనైనా రాణించవచ్చని కెరీర్ నిపుణులు చెబుతున్నారు. కొత్త స్కిల్స్ నేర్చుకోవడమే అసలైన ఆయుధం:జిగ్ జాగ్ కెరీర్‌లో సక్సెస్ అవ్వాలంటే నిరంతరం నేర్చుకుంటూనే ఉండాలి. దీన్నే 'అప్‌స్కిల్లింగ్' అంటారు. మీరు ఒక కంపెనీలో పనిచేస్తున్నప్పుడే మరో రంగానికి సంబంధించిన కోర్సులు చేయడం వల్ల, రేపు పొద్దున ఆ ఉద్యోగం పోయినా లేదా మీకు బోర్ కొట్టినా వెంటనే ఇంకో మంచి ఆఫర్ పట్టేయొచ్చు. ఈ ఫ్లెక్సిబిలిటీ వల్ల మన మీద మనకు నమ్మకం పెరుగుతుంది. ఇక అందుకే ఇప్పుడు చాలామంది యువత ఒకే ఫీల్డ్‌కు స్టిక్ అయిపోకుండా అన్నిటిలోనూ ప్రావీణ్యం సంపాదిస్తున్నారు.

## రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వంలో..

# మహిళలకు పెద్దపీట- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్, ఇందిరమ్మ ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడగానే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం మహాలక్ష్మీని చేపట్టామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. కాంగ్రెస్ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఆర్టీసీ బస్సులను శాసనసభకి రప్పించి మహాలక్ష్మీ పథకానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ 'మా ఆర్టీసీనీ రక్షించుకోవడానికి అన్ని కార్యక్రమాలు చేస్తూనే మహాలక్ష్మీ పథకాన్ని అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ప్రతినెలా ఆ సొమ్ములు చెల్లించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అప్పట్లో సూచించారు. నెల నెలా ఎంతమంది ప్రయాణం చేస్తున్నారు, ఇతర వివరాలను ఆర్థికశాఖకి పంపించినట్టు చెప్పారు. ఆర్థికశాఖ ఆర్టీసీకి డబ్బులు చెల్లించిందని గుర్తు చేశారు. మహిళలు దాదాపు 300 కోట్ల సార్లు ప్రయాణించి రూ. 10 వేల కోట్ల రూపాయలు ఆదా చేసుకున్నారని అభినందించారు. పేద మధ్యతరగతి కుటుంబాల ప్రయోజనాలు ఆర్టీసీ ఉచిత ప్రయాణం మూలంగా ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్‌లో మీరు ప్రయాణం చేసిన నగదు రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లిస్తుందని గుర్తు చేశారు. వడ్డీలేని రుణాలు ఏడాదికి రూ.20 వేల కోట్లు బ్యాంకు లింకేజీతో ఇప్పించడం జరుగుతుందన్నారు. సంవత్సరానికి లక్ష కోట్లు మహిళలకు ఇప్పిస్తామన్నారు. సంకల్పం ఉంటే ఏదైనా సాధ్యమేననీ, ఇందిరమ్మ ప్రభుత్వం చేసి చూపిస్తుందని గుర్తు చేశారు. ఇప్పటికే రూ. 57 వేల కోట్ల బ్యాంకు లింకేజీ ద్వారా మహిళలకు అందించామని ప్రకటించారు. వచ్చే మూడేండ్ల ల్లో రూ. లక్ష కోట్ల టార్గెట్‌ను మహిళలకు దాటిస్తామన్నారు. అవి రూ1.50 లక్షల కోట్లు దాటినా ఆశ్చర్యం లేదని గుర్తుచేశారు. మహిళలకు లక్ష కోట్లకి చెల్లించాల్సిన వడ్డీ చెల్లిస్తున్నానీ, మేము ఇప్పటికీ రూ. 3800 కోట్లలో రూ. 1000 కోట్లు వేయి కోట్లు చెల్లించడం, బడ్జెట్‌లో రూ. 2800 కోట్లు పెట్టామని వివరించారు. వచ్చే ఐదేండ్లకాలం లో రూ, 10 వేల కోట్లు మహిళలకు వడ్డీ చెల్లిస్తామని హామీనిచ్చారు. మహిళల ద్వారా కొత్త ఆర్థిక వ్యవస్థ ఏర్పడుతుందనీ, దీనిపై ఎలాంటి కఠిన నిర్ణయాలనైనా రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవడానికి సిద్ధంగా ఉందని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున మహిళలకు స్వయం సహాయక సంఘాల్లో చేర్పిస్తున్నామనీ, వారికి వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని తెలిపారు. వారికి సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు పెట్టుకోవడానికి నిధులు ఇచ్చి, వ్యాపారస్థులను చేయడమే లక్ష్యమని వివరించారు. మహిళలందరికీ వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేస్తున్నామనీ, మంత్రి సీతక్క నేతత్వంలో అనేక కొత్త పథకాలు తీసుకొ స్తున్నామని వివరించారు. మహిళలను ఆర్టీసీ బస్సులకు యజమానులను చేశారు. సోలార్ పవర్ ప్లాంట్ ,పెట్రోల్ బంకులు పెట్టిస్తున్నామని తెలిపారు. మహిళలు ఆర్థికంగా బలోపేతమైతే కుటుంబం, సమాజం ఆర్థికంగా బలోపేతమవుతుందని గుర్తు చేశారు.

48 గంటల్లోనే మహాలక్ష్మిని అమలుచేశాం : పొన్నం

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇప్పటి వరకు 290 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేసి రూ.10 వేల కోట్లు ఆదా చేసుకున్నారని వివరించారు. మహిళా ప్రయాణికులే కాదు సీ తక్క నేను డిప్యూటీ సీఎం కలిసి మహిళలను ఆర్టీసీ బస్సులకు యజమానులను చేయడం జరిగిందని గుర్తుచేశారు. తెలంగాణ ప్రజాపాలన ప్రభుత్వం పక్షాన మహిళలకు అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి యాజమాన్యంతో ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ ముందుకు పోతున్నామన్నారు. రోజుకు 65 లక్షల మంది ప్రయాణికుల్లో 40 మంది మహిళా ప్రయాణికులు 97 డిపోలు 35 లక్షల కిలోమీటర్లు ఆర్టీసీ బస్సులు ప్రయాణం చేస్తున్నాయని అన్నారు. ఈ మహాలక్ష్మీ పథకం విజయవంతం అవడంలో ఆర్టీసీ కార్మికుల పాత్ర మరువలేనిదన్నారు. డ్రైవర్లు, కండక్టర్లకు ప్రభుత్వం పక్షాన హదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నట్టు చెప్పారు. రాఖీ పండగ వచ్చిన కుటుంబ సభ్యులతో గడపకుండా ఆర్టీసీ డ్యూటీ చేస్తూ రికార్డు స్థాయిలో ప్రయాణికులను తరలించారన్నారు. ఇటీవల శాసనసభలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఉమ్మడి జిల్లాల ప్రజాప్రతినిధులతో ముఖాముఖి నమావేశం ఏర్పాటు చేసుకున్నామన్నారు. నియోజ కవర్గాల వారిగా అవసరమైన కొత్త రూట్‌లు , కొత్త బస్సులు , బస్‌స్టేషన్ల అభివద్ధి పై నివేదిక తీసుకున్నామన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో 340 కొత్త రూట్‌లలో కొత్తగా బస్సులు నడపడం ప్రారంభించామని వివరించారు. రాష్ట్రంలో ప్రతి మూలాల్లో ఆర్టీసీ బస్సులు నడిపేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామన్నారు. సీసీఎస్, పీఎఫ్ బకాయిలు తీరుస్తున్నామన్నారు. యూనియన్ల ఏర్పాటు, ఆర్టీసీ విలీనం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని గుర్తుచేశారు. మిగతా ఏ సమస్యలు ఉన్నా ఆర్టీసీ పరిష్కారం చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. 2018లోనే ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులు తెచ్చారనీ, మా ప్రభుత్వం కాదన్నారు. కొంత మంది యూనియన్ల పేరుతో కావాలని రెచ్చగొడుతున్నారని చెప్పారు. తెలంగాణకు ఆర్టీసీనే లైఫ్‌లైన్, దేశంలో రైల్వే కనెక్టివిటీ ఎక్కువ అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్, మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మీ, ఆర్టీసీ ఎండీ వి నాగిరెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రాంచంద్రన్, సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన, ఐఏఎస్ అధికారు శృతి ఓజా, సృజన తదితరులు హాజరయ్యారు.

# కమల్ హీరో... రజినీ విలన్?



సూపర్ స్టార్ రజినీకాంత్, లోక నాయకుడు కమల్ హాసన్‌ల కలయికలో 46 ఏళ్ల తర్వాత సినిమా రాబోతుండడం వాళ్లిద్దరి అభిమానులనే కాక దక్షిణాది సినీ ప్రేక్షకులందరినీ ఎంతో ఉత్సాహానికి, ఉద్వేగానికి గురి చేస్తోంది. కోలమావు కోకిల, డాక్టర్, బీస్ట్, జైలర్ చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నెల్సన్ దిలీప్ కుమార్ ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేయబోతున్నాడు.రజినీ, కమల్ మంచి మిత్రులైనప్పటికీ.. వారి మధ్య దశాబ్దాలుగా వృత్తిపరమైన పోటీ ఉంది. అభిమానుల మధ్య ఫ్యాన్ వార్స్ సంగతీ చెప్పాల్సిన పని లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకునే ఈ ప్రోమోలో ఇద్దరూ నువ్వెంత అంటే నువ్వెంత అన్నట్లు వ్యవహరించారు. అసలీ సినిమాలో హీరో ఎవరో చెప్పాలంటూ ఇద్దరు దర్శకుడు నెల్సన్‌ను ఇరుకున పెట్టేలా ప్రశ్నలు కూడా సంధించారు. కానీ ఆ ప్రశ్నకు ప్రోమోలో జవాబు మాత్రం ఇవ్వలేదు.ఐతే ఈ చిత్రంలో రజినీకాంత్ నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్ర చేస్తుండొచ్చు అనే చర్చ జరుగుతోంది. రజినీ, కమల్ ఇద్దరూ నెగెటివ్ రోల్స్ చేయడంలో ఎవరికి వాళ్లే సాటి. కెరీర్ ఆరంభంలో రజినీ విలన్ పాత్రలు చాలానే చేశాడు. 'రోబో' సినిమాలో నెగెటివ్ షేడ్స్‌ను అద్భుతంగా పండించాడు.ఇక కమల్ 'అభయ్' సినిమాలో హీరోగా, విలన్‌గా నటించాడు. 'కల్కి' చిత్రంలోనూ విలన్ పాత్ర చేసిన సంగతి తెలిసిందే. ఐతే కమల్‌ను మించి రజినీనే నెగెటివ్ క్యారెక్టర్‌ను బాగా చేయగలడన్నది స్పష్టం. అందుకే ఆయన పాత్రను కొంచెం నెగెటివ్ షేడ్స్‌తో తీర్చిదిద్ది ఉండొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ప్రోమోలో ముందుగా కమల్‌ను చూపించి, పేరు కూడా తనదే ముందు వేయడం కూడా ఈ అనుమానాలను బలపరుస్తోంది. ఐతే బాల నటుడిగా ఐదేళ్ల వయసు నుంచే సినిమాలు చేయడం ద్వారా నటనలో రజినీ కంటే కమలే సీనియర్ కాబట్టి ఆయన పేరు ముందు వేసి ఉండొచ్చు, ఆయన్నే ముందు చూపించి ఉండొచ్చని.. అంతమాత్రాన ఆయనే హీరో అని.. రజినీ విలన్ అని ఒక అభిప్రాయానికి రావడం కూడా కరెక్ట్ కాదనే వాదన కూడా వినిపిస్తోంది.ఐతే ప్రోమో ద్వారా మూవీలో ఒక్కరే హీరోనా.. లేక ఇద్దరూ హీరోలుగానే కనిపించనున్నారా అనే చర్చను లేవనెత్తి ఈ సినిమాకు ఆరంభంలోనే కావాల్సినంత బజ్ తీసుకొచ్చాడు నెల్సన్.

# మున్నా మంచి స్ట్రాటజీ వాడుతున్నాడు



మాములుగా రీ రిలీజులు ఏవి ఆడతాయో ఏవి ఆడవో అంత ఈజీగా చెప్పలేని పరిస్థితి నెలకొంది. గత ఏడాది ఖలేజాని అభిమానులు ఎగబడి చూస్తే అతడుని అంతగా పట్టించుకోలేదు. మగధీరని డిమాండ్ చేయని ఫ్యాన్స్ ఆరెంజ్ కు మాత్రం ప్రతిసారి బ్రహ్మరథం పడుతున్నారు. అలాని ఫ్లాపులన్నీ డబ్బులు తెస్తున్నాయని కాదు.రెబెల్ లాంటివి వర్కౌట్ కాలేదు. ఇక అసలు విషయానికి వస్తే మార్చి 6 ప్రభాస్ మున్నా మళ్ళీ థియేటర్లకు వస్తోంది. వంశీ పైడిపల్లిని దర్శకుడిగా పరిచయం చేస్తూ దిల్ రాజు నిర్మించిన ఈ భారీ బడ్జెట్ మూవీ అప్పట్లో కమర్షియల్ ఫెయిల్యూర్. అంచనాలు అందుకోలేక ఓ మోస్తరుగా ఆడింది.అయినా సరే కొన్ని స్టైలిష్ యాక్షన్ ఎపిసోడ్స్, హారిస్ జైరాజ్ పాటలు, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ మళ్ళీ చూడనిపించేలా ఉంటాయి. స్వంత తండ్రే హీరోకి విలన్ కావడం, అతన్ని చంపడమే లక్ష్యంగా స్టోరీ సాగడం అప్పటి ప్రేక్షకులు జీర్ణించుకోలేకపోయారు. అందుకే ప్రకాష్ రాజ్, ప్రభాస్ కాంబో అద్భుతమైన పెర్ఫార్మన్స్ జనాన్ని మెప్పించలేకపోయింది.కానీ ఇప్పుడా సమస్య లేదు. జెన్ జీ కుర్రాళ్లకు నచ్చే ఛాన్స్ ఉంది. పైగా ఎలాగూ పాటల కోసమే జనాలు రీ రిలీజులను సెలెబ్రేట్ చేసుకుంటున్నారు కాబట్టి మున్నాలో వాటికి లోటు లేదు. ఇక మంచి స్ట్రాటజీ అని చెప్పేందుకు ప్రధాన కారణం ఒకటుంది.మార్చి 6 భలే డేట్. విష్ణు విన్యాసం తప్ప చెప్పుకోదగ్గ కొత్త సినిమాలు లేవు. దానికి టాక్ వచ్చిందా శ్రీవిష్ణు వసూళ్లు లాగేస్తాడు. కాంపిటీషన్ ఎలాగూ లేదు కాబట్టి రెండో ప్లేస్ మున్నా వాడుకోవచ్చు. సోషల్ మీడియాలో ఎస్విసి టీమ్ బాగానే పబ్లిసిటీ చేస్తోంది.ఆరెంజ్ లాగా ఇది కూడా సర్ప్రైజ్ హిట్ అవ్వొచ్చనే నమ్మకంతో ఫ్యాన్స్ కూడా ఎదురు చూస్తున్నారు. ఇలియానా హీరోయిన్ గా నటించిన మున్నాలో గ్యాంగ్ స్టర్ నేపథ్యం ఉన్నప్పటికీ హుషారైన కాలేజీ ఎపిసోడ్స్ కూడా అలరిస్తాయి. మరి పంతొమ్మిది సంవత్సరాల క్రితం 2007లో వచ్చిన మున్నా ఇప్పుడు 2026లో ఏమైనా మేజిక్ చేస్తుందేమో చూడాలి.

# గోదావరి పుష్కర ఏర్పాట్ల పనులను వేగవంతం చేయాలి



నిజామాబాద్, : వచ్చే ఏడాది జూలైలో అట్టహాసంగా జరుగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని ఏర్పాట్లను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. రెంజల్ మండలంలోని కందకుర్తి పుష్కర ఘాట్ ను కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. పక్షం రోజుల క్రితం కూడా ఈ పుష్కర ఘాట్ ను సందర్శించిన సమయంలో అధికారులకు పురమాయించిన పనులను వారు ఏమేరకు చేపట్టారు అని క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు.పుష్కర ఘాట్ కు వచ్చే మార్గాలలో రహదారుల మరమ్మతులు, విస్తరణ పనులను, శివాలయం వద్ద కొనసాగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని అన్నారు. పుష్కరాల సమయంలోనే కాకుండా ఈ ప్రదేశానికి సాధారణ సమయాలలోనూ భక్తులు తరలివస్తారని, వారి సౌకర్యార్ధం పరిసరాల పరిశుభ్రతతో పాటు భక్తులకు కనీస వసతులు అందుబాటులో ఉండేలా చొరవ చూపాలన్నారు.గోదావరి పుష్కరాలకు త్రివేణి సంగమ ప్రాంతం అయినందున ఈ ఘాట్ వద్ద పుణ్య స్నానాల కోసం ప్రముఖులతో పాటు, లక్షలాదిగా భక్తులు పుణ్య స్నానాలకు తరలివచ్చే అవకాశాలు ఉన్నందున ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రాకపోకలకు ఆటంకాలు తలెత్తకుండా ఉండేందుకు ఆయా మార్గాలలో అవసరమైన చోట కల్వర్టుల నిర్మాణాలు సైతం చేపట్టాలన్నారు. వి.వి.ఐ.పీల కోసం హెలిప్యాడ్ ను నిర్మించాలని, వాహనాల పార్కింగ్, మరుగుదొడ్లు, తాత్కాలిక గదులు, భక్తులు బస చేసేందుకు వీలుగా తగిన వసతి, షామియానాలు వంటి వాటిని నాణ్యతతో చేపట్టి నిర్ణీత గడువు లోపు పూర్తి చేసేలా చూడాలన్నారు.ఘాట్ వద్ద ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అంతకుముందు కలెక్టర్ కందకుర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెంజల్ మండల అధికారులతో సమావేశం అయ్యారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, జనాభా గణన ప్రక్రియల నిర్వహణపై కీలక సూచనలు చేశారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, దేవాదాయ శాఖ అధికారులు కమల, విజయరామారావు, తహసిల్దార్ శ్రవణ్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు ఉన్నారు.

# రోడ్డు భద్రతకు ప్రాధాన్యత- ఎస్పీ శరత్ చంద్ర పవార్




దేవరకొండ, : ప్రమాదాల నివారణే లక్ష్యంగా నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ నేతృత్వంలో చేప ట్టిన 'అలైవ్... అరైవ్' కార్యక్రమంలో భాగంగా కొండమల్లేపల్లి మండలం చిన్నఅడి శర్లపల్లి గ్రామంలో లారీ డ్రైవర్లు, క్లీనర్లకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిఁచారు. స్థానిక ఫంక్షన్ హాల్లో ఏర్పా టు చేసిన ఈ శిబిరాన్ని ఎస్పీ శరత్ చంద్ర పవార్ స్వయంగా ప్రారంభించి డ్రైవ ర్ల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సుదీర్ఘ ప్రయాణాలు చేసే భారీ వాహన డ్రైవర్లకు కంటి చూపు అత్యంత కీలకమని చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ డీఎస్పీ శ్రీని వాస రావు, కొండమల్లేపల్లి సీఐ నవీన్ కుమార్, ఎస్ఐ అజ్మీరా రమేష్, గ్రామ సర్పంచ్ పందుల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు. సామాజిక బాధ్యతతో పోలీస్ శాఖ చేపట్టిన ఈ కార్యక్రమం పట్ల స్థానికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఆర్థిక వ్యవస్థపై పశ్చిమాసియా దెబ్బ

న్యూఢిల్లీ : అమెరికా సామ్రాజ్యవాదం తో పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం భారత ఆర్థిక వ్యవస్థకు పెను సవాలుగా మారుతుంది. ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానున్న 2026-27 ఆర్థిక సంవత్సరం లోనూ ఈ యుద్ధ వాతావరణం ఇలాగే కొనసాగితే భారత జీడీపీ అంచనాల్లో దాదాపు 1 శాతం మేర కోత పడే ప్రమాదం ఉందని గ్లోబల్ టాక్స్ కన్సల్టింగ్ సంస్థ 'ఇవై' తన ఎకానమీ వాచ్ నివేదికలో వెల్లడించింది. కేవలం వృద్ధి తగ్గడమే కాకుండా సామాన్యుడిపై ధరల భారం కూడా భారీగా పెరగనుందని, రిటైల్ ద్రవ్యోల్బణం బేస్‌లైన్ అంచనాల కంటే మరో 1.5 శాతం ఎగబాకే అవకాశం ఉందని ఈ నివేదిక స్పష్టం చేసింది. 2026-27లో భారత జిడిపి 6.8 శాతం నుంచి 7.2 శాతం మధ్య ఉండొచ్చని ఫిబ్రవరిలో ఇవై అంచనా వేసింది. తాజా రిపోర్ట్‌తో ఈ అంచనాలను 5.8 శాతం నుంచి 6.2 శాతానికి కోత పెట్టినట్లయ్యింది. 2026-27లో జీడీపీ రేటు 6.1 శాతానికి పరిమితం కావచ్చని ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో-ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) అంచనా వేసింది. పశ్చిమాసియా సంక్షోభంతో ఉపాధి కల్పనలో కీలకమైన రంగాలు తీవ్రంగా నష్టపోయే సూచనలు కనిపిస్తున్నాయి. టెక్స్‌టైల్స్, పెయింట్స్, కెమికల్స్, ఫెర్టిలైజర్స్, సిమెంట్, టైర్ల వంటి పరిశ్రమలు నేరుగా ప్రభావితం కానున్నాయి.

# వేతనాల వేటలో బెంగళూరు వర్సెస్ హైదరాబాద్

హైదరాబాద్, భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన ఐటీ రంగం, 2025 నాటికి సరికొత్త శిఖరాలను అధిరోహిస్తోంది. ఒకప్పుడు కేవలం సేవా రంగంగా గుర్తింపు పొందిన భారత టెక్ ప్రపం చం.. నేడు గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా రూపాంతరం చెందింది. ఈ క్రమంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల వేతనాలు కేవలం వారి నైపుణ్యంపైనే కాకుండా వారు నివసించే నగరంపై కూడా ఆధారపడి ఉండటం ఒక గమనార్హమైన పరిణామం. ఇటీవల విడుదలైన గణాంకాలు భారత ఐటీ భూగోళంలో మారుతున్న ప్రాధాన్యతలను స్పష్టం చేస్తున్నాయి.బెంగళూరు పట్టు.. హైదరాబాద్ దూకుడుదశాబ్దాలుగా భారత సిలికాన్ వ్యాలీగా చెక్కుచెదరని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్న బెంగళూరు 2025లోనూ ?33.65 లక్షల సగటు వేతనంతో అగ్రస్థానంలో నిలవడం ఆశ్చర్యకరం ఏమీ కాదు. అయితే ఈ గణాంకాల వెనుక ఉన్న అసలైన కథ హైదరాబాద్ ఎదుగుదల. ?30.26 లక్షల సగటు వేతనంతో హైదరాబాద్ ఇప్పుడు బెంగళూరుకు గట్టి పోటీని స్తోంది. గడచిన ఐదేళ్లలో తెలంగాణ ప్రభుత్వం అనుసరించిన విధానాలు, అంతర్జాతీయ దిగ్గజాలను ఆకర్షించడంలో చూపిన చొరవ నేడు సాఫ్ట్‌వేర్ నిపుణుల జేబుల్లో ప్రతిబింబిస్తోంది. కేవలం జీతాలే కాకుండా, మెరుగైన మౌలిక సదుపాయాలు ఉండటం వల్ల ప్రతిభావంతులు ఇప్పుడు 'భాగ్యనగరం' వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రాంతీయ అసమానతలు.. ఆందోళన కలిగించే అంశంఈ నివేదికలోని మరో కోణం ప్రాంతీయ అసమానతలను ఎత్తిచూపుతోంది. ఒకవైపు దక్షిణ, పశ్చిమ భారత నగరాలు ఐటీ ఫలాలను జుర్రుకుంటుంటే.. తూర్పు , ఉత్తర భారతంలోని కొన్ని ప్రాంతాలు ఇంకా వెనుకబడే ఉన్నాయి. ఢిల్లీ ఎన్సీఆర్ (21.38 లక్షలు) కొంతవరకు తన ఉనికిని చాటుకుంటున్నప్పటికీ కోల్‌కతా (9.15 లక్షలు), అహ్మదాబాద్ (8.97 లక్షలు) వంటి నగరాలు జాతీయ సగటు కంటే చాలా వెనుకబడి ఉన్నాయి. ఒకే దేశం, ఒకే వృత్తి అయినప్పటికీ నగరాన్ని బట్టి జీతంలో దాదాపు 300% వ్యత్యాసం ఉండటం గమనార్హం. ఇది ఆయా ప్రాంతాల నుంచి ప్రతిభావంతులు వలస వెళ్లడానికి ప్రధాన కారణమవుతోంది.జీవన వ్యయం.. జీతంకేవలం వేతనాల అంకెలను చూసి నగరాల స్థాయిని అంచనా వేయడం కూడా పాక్షికమే అవుతుంది. ముంబై వంటి నగరాల్లో 18.42 లక్షల సగటు జీతం ఉన్నప్పటికీ అక్కడ ఉండే అధిక అద్దెలు, రవాణా ఖర్చుల వల్ల ఇంజనీర్ల మిగులు ఆదాయం తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలోనే పుణే, హైదరాబాద్ వంటి నగరాలు 'కాస్ట్-టు-లివింగ్' నిష్పత్తిలో అగ్రగామిగా నిలుస్తున్నాయి. 2025లో సాఫ్ట్‌వేర్ రంగం కేవలం కోడింగ్ రాయడం మాత్రమే కాదు.. అది ఆర్థిక వృద్ధికి కొలమానంగా మారింది. బెంగళూరు తన కిరీటాన్ని కాపాడుకుంటున్నప్పటికీ హైదరాబాద్ వంటి నగరాల వేగం భారత ఐటీ రంగంలో 'బహుళ కేంద్రాల' అభివృద్ధికి సంకేతం. అయితే ప్రభుత్వం, పరిశ్రమలు కలిసి కోల్‌కతా, అహ్మదాబాద్ వంటి నగరాల్లో కూడా ఐటీ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. అప్పుడే అభివృద్ధి అన్ని ప్రాంతాలకు సమానంగా అందుతుంది. కేవలం అంకెల్లోనే కాదు... అవకాశాల్లో కూడా భారత్ అగ్రగామిగా నిలవాలి.

